కూలీల ప్రాణాలు..గాలిలో దీపాలు



న్యూస్‌టుడే- నారాయణపేట న్యూటౌన్, మక్తల్ పట్టణం

జిల్లాలో పత్తి కూలీల బతుకులు ప్రమాదపు టంచులో ఉన్నాయి. పెరిగిన సాగునీటి వనరుల మూలంగా పంటల విస్తీర్ణం విస్తరించింది. స్థానికంగా దీనికి సరిపడా వ్యవసాయ కూలీలు లేకపోవడంతో బయటి ప్రాంతాల నుంచి రప్పించాల్సిన అవసరం ఏర్పడుతోంది. ఇదే అదనుగా ప్రైవేటు వాహనదారులు చట్టాన్ని ఉల్లంఘిస్తూ లెక్కకు మించి కూలీలను తరలిస్తున్నారు. ఒకొక్క పెద్ద ఆటోకు 20 నుంచి 25 మందిని ఎక్కిస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో ఊహించుకోవచ్చు. ఎనిమిది సీట్ల వాహనం అయితే మరింత మందిని కూరేస్తున్నారు. ఎప్పుడు ఏ రూపాన రహదారి ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి.

జిల్లాలో 2014 ముందు పత్తి సాగే లేదు. ఒకరిద్దరు ఆంధ్ర ప్రాంతం నుంచి వచ్చి భూమిని కౌలుకు తీసుకొని సాగు చేసేవారు. నీరు, ఖర్చుతో కూడిన పంట కావడంతో సాగు చేసేందుకు స్థానికులు ధైర్యం చేసేవారు కాదు. 2014 తర్వాత జూరాల, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల వంటి సాగునీటి పథకాలు అందుబాటులోకి రావడంతో పలు మండలాలకు సాగునీటి కొరత లేకుండా పోయింది. పత్తి సాగు ఏటేటా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం జిల్లాలో సాధారణ విస్తీర్ణం 1,80,635 ఎకరాలు కాగా ఈ ఏడాది ఇంతే స్థాయిలో సాగు చేశారు. గత నెల రోజులుగా తొలి కాపు చేతికొచ్చింది. దీంతో పత్తి కూలీలకు విపరీతమైన డిమాండ్ నెలకొంది. ఒక్కొక్కరికి రోజుకు రూ. 300 కూలీగా చెల్లిస్తున్నారు. స్థానికంగా సరిపడా కూలీలు లభ్యం కాకపోతుండటంతో బయటి మండలాల నుంచి రప్పిస్తున్నారు. పత్తి సాగు చేయని, సాగునీటి వనరులు అందుబాటులో లేని కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మద్దూరు, దామరగిద్ద, కోస్గి మండలాల నుంచి కూలీలు ధన్వాడ, నర్వ, మరికల్, మక్తల్, ఆత్మకూర్ తదితర మండలాలకు నిత్యం ఆటోలు, బొలేరో వాహనాలతో పాటు జీపుల్లో వస్తూ వెళ్తున్నారు. వీరి రాకపోకలు ప్రమాదకరంగా మారుతున్నాయి.

సాధారణంగా ఆటోలో డ్రైవర్‌ను కలుపుకొని అయిదుగురు మాత్రమే ప్రయాణించే అవకాశం ఉండగా, నాలుగింతల ఎక్కువ సంఖ్యలో అంటే 20కి మించి కూలీలను తరలిస్తున్నారు. బొలేరో వాహనంలో కనిష్టంగా 50 మందిని తీసుకెళ్తున్నారు. జీపుల్లో 30 మందికి తక్కువ వెళ్లడంలేదు. వాహనాలకు వేలాడుతూ, టాపుపై కూర్చొని, అటు ఇటు నిలబడి చేస్తున్న ప్రయాణాలు భీతిగొల్పుతున్నాయి. మరికల్ మండలం కన్మనూర్ శివారులో ఇటీవల పత్తితీతకు వచ్చిన కర్ణాటక మహిళలు వర్షం వస్తుందని చెట్టునీడకు చేరగా పిడుగు పడి ఒకరు మృతి చెందటమే కాకుండా ఇద్దరు గాయాలపాలయ్యారు. గతంలోనూ లెక్కకు మించి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు కోకొల్లలు. వాహనాలు ఎదురైతే పోలీసు అధికారులు నిలిపి కూలీలకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. ఆ తర్వాత యథావిధిగానే తరలివెళ్తున్నారు. చదువుకుంటున్న పిల్లల్ని తల్లిదండ్రులు పత్తి తీతకు తీసుకెళ్తున్నారు. దీని వల్ల విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యం పడిపోతోంది. పాఠశాలల్లో హాజరు శాతం సైతం తగ్గిపోతోంది.



పత్తిపొలం నుంచి వెనుదిరిగి పోతున్న కూలీలు

కౌన్సెలింగ్ చేస్తున్నాం



మా వంతుగా ప్రతి రోజు తనిఖీలు నిర్వహిస్తున్నాం. వాహనాల్లో లెక్కకు మించి కూలీలు కనిపిస్తే కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. కేసు నమోదు చేస్తామని వాహనదారులను హెచ్చరిస్తున్నాం. ఆ తర్వాత పరిస్థితి యథాతథమే అవుతోంది. ఎవరికైనా ఏమైనా జరిగితే కుటుంబాల పరిస్థితి ఏమిటో ఆలోచించుకోవాలి. **- చంద్రశేఖర్ సీఐ, మక్తల్**

పోలీసు అమరుల త్యాగం.. భావితరాలకు స్ఫూర్తి





అమరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, న్యూస్‌టుడే : శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సంఘ విద్రోహ శక్తులతో పోరాడి ప్రాణాలర్పించిన అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అమరవీరుల సంస్మరణ సోమవారం పోలీసు కవాతు మైదానంలో ఘనంగా నిర్వహించారు. స్తూపం వద్ద కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ యోగేశ్‌గౌతమ్, శిక్షణ కలెక్టర్ గరిమా నరుల, పోలీసు అధికారులు, అమరుల కుటుంబ సభ్యులతో కలిసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ అమరులైన పోలీసుల కుటుంబాలకు ఎలాంటి అవసరాలు ఉన్నా కలెక్టర్ కార్యాలయం నుంచి సహకారం ఉంటుందన్నారు. ఎస్పీ యోగేశ్ గౌతమ్ మాట్లాడుతూ అంతర్గత భద్రత విధుల్లో కానిస్టేబుల్ రాజారెడ్డి 2005లో వీరమరణం పొందారని, వారి కుటుంబ సభ్యులకు పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. కలెక్టర్, ఎస్పీలు అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకుని జ్ఞాపికలను అందజేశారు. ఎస్పీ కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించి అమరులకు జోహార్లు అర్పించారు. అదనపు ఎస్పీ రియాజ్ ఉల్ హక్, డీఎస్పీ ఎన్.లింగయ్య, ఆర్డీవో నర్సింహ, డీఎంహెచ్‌వో డా.సౌభాగ్యలక్ష్మి, సీఐలు, ఆర్డీవో, అమరుల కుటుంబీకులు, ఎస్ఐలు, ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమాల దస్త్రం

మరుగున పడినట్లేనా?

ధరూరు న్యూస్‌టుడే: గొర్రెల పంపిణీపై గత కొన్ని నెలల క్రితం ప్రభుత్వం విచారణకు ఆదేశించడంతో అక్రమార్కుల్లో ఆందోళన మొదలైంది. నెలలు గడుస్తున్న కొద్దీ అక్రమాలపై విచారణ ఊసే కనిపించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో మరో ముగ్గురు అధికారుల అరెస్టులు తప్ప పెద్దగా విచారణలో పురోగతి కనిపించడం లేదు. ఈ పథకంలో భాగంగా ఉమ్మడి జిల్లాలో రీసైక్లింగ్ ద్వారా పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. అధికారులతోపాటు కొందరు గొర్రెల పంపిణీదారుల సంఘం అధ్యక్షుల పాత్ర కూడా ఈ అవకతవకల్లో ఉందన్నది స్పష్టం. కాని క్షేత్ర స్థాయిలో దీనిపై ఎలాంటి విచారణ చేపట్టడం లేదు. దీంతో అక్రమార్కులపై చర్యలు ఉంటాయా? లేదోనన్న? అనుమానాలు ప్రజల్లో కలుగుతున్నాయి.




లబ్ధిదారులకు పంపిణీ చేసిన గొర్రెలు

గొర్రెల్ని సక్రమంగా లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అప్పట్లో ఓ అధికారిని సస్పెండ్ చేశారు. గద్వాల జిల్లాలో అధికారులు అనంతపురం వెళ్లి ఏజెంట్ల నుంచి పెద్ద మొత్తంలో డబ్బు వసూలు చేసినట్లు ఫిర్యాదులున్నాయి. నాడు అక్కడ పని చేసిన ఏడీ డబ్బు పంపిణీ వ్యవహారంలో గొడవకు దిగినట్లు ఆరోపణలొచ్చాయి.

కాగ్ గుర్తించిన అంశాలు..

గొర్రెల పంపిణీలో జరిగిన అనేక అక్రమాలను కాగ్ గుర్తించింది. ఉమ్మడి జిల్లాలో మొత్తం 70,688 యూనిట్లు పంపిణీ చేశారు. దీని కోసం ప్రభుత్వ నిధులు రెండు విడతల్లో రూ. 730 కోట్ల వరకు ఖర్చు చేశారు. కాగ్ పరిశీలనలో మహబూబ్‌నగర్ జిల్లాలో 108 గొర్రెలను ఒక కారులో తరలించినట్లుగా రికార్డుల్లో పొందుపరిచినట్టు గుర్తించింది. ఇక్కడ రవాణా వాహనం డీసీఎం నంబరు బదులు కారు నంబరు నమోదు చేశారు.

- ఒకే సమయంలో ఒకే వాహనంలో వేర్వేరు ప్రాంతాల నుంచి గొర్రెలు తరలించినట్లు రికార్డుల్లో నమోదై ఉంది. శ్రీకాకుళం, కడప, కర్నూలులోని పలు ప్రాంతాల నుంచి కూడా ఇదే వాహనంలో తరలించినట్లు రికార్డుల్లో ఉంది.
- ధన్వాడ మండలానికి వచ్చిన



- పలు నియోజకవర్గాల పరిధిలో విజిలెన్స్ విచారణలో బయటపడిన వాస్తవాలు అందరినీ విస్మయానికి గురి చేశాయి. చాలాచోట్ల యూనిట్లే కనిపించని విషయాన్ని గుర్తించారు. నాగర్‌కర్నూల్ జిల్లా మాచర్ల కేంద్రంగా పెద్ద ఎత్తున రీసైక్లింగ్ జరిగినట్లు ఆరోపణలొచ్చాయి.
- వనపర్తి జిల్లాలో కొత్తకోట, మదనాపురం మండలాల్లో పెద్ద ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. జడ్చర్ల, మానవపాడు రాజోళ్లి గొర్రెల రీసైక్లింగ్‌కు పాల్పడిన వ్యక్తులపై కేసులు నమోదయ్యాయి. అప్పట్లో క్షేత్రస్థాయిలో పూర్తి విచారణ చేసి నివేదికలు ఇవ్వాల్సిందిగా జిల్లా అధికారులకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. కానీ ఇప్పటి వరకు నివేదికల ఆధారంగా క్షేత్రస్థాయిలో విచారణగానీ అక్రమార్కులపై చర్యలుగానీ లేవు. అసలు పంపిణీలో అక్రమాలపై విచారణ జరుగుతుందా? దస్త్రం మూసేస్తారా అనేదానిపై మాకే స్పష్టత లేదని ఉమ్మడి జిల్లాలో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ పశువైద్యాధికారి చెప్పుకొచ్చారు.

రెండు విడతల్లో పంపిణీ చేసిన గొర్రెలు	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	గద్వాల	నారాయణపేట
	16,721	19,127	14,511	10,525	9,804

విద్యుత్తుశాఖ ఎస్ఈగా సంజీవరెడ్డి



విద్యుత్తుశాఖ ఎస్ఈ సంజీవరెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే: నారాయణపేట విద్యుత్తుశాఖ ఎస్ఈగా సంజీవరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక డీఈ నరసింహారావు, ఎంఎస్‌పీ డీఈ శ్రీనివాస్, డీఈటీ జితేంద్ర, మక్తల్ ఏడీ రామకృష్ణ, నారాయణపేట ఏడీ సీహెచ్ శ్రీనివాస్‌తో పాటు ఏఈలు, విద్యుత్తు ఉద్యోగులు 1104 యూనియన్ నాయకులు కొత్త ఎస్ఈని ఘనంగా సన్మానించారు. నాణ్యమైన విద్యుత్తు వినియోగదారులకు అందించడానికి అంతా శాయశక్తులా కృషి చేద్దామని కొత్త ఎస్ఈ ఉద్యోగులకు సూచించారు. కార్యక్రమంలో 1104యూనియన్ డివిజన్ అధ్యక్షులు మొగులప్ప, కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, రాజు, మల్లికార్జున్, నజీర్, యాసీన్ పాషా, రవీంద్రచారి, గోవిందరాజు, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పంటల సర్వేపై చిక్కుముడి



సాగు పనుల్లో రైతులు (పాతచిత్రం)

కొత్తకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుపై డిజిటల్ సర్వే చేయాలని ఏఈవో (వ్యవసాయ విస్తరణ అధికారు)లను ఆదేశించడంతో వారు నిరాకరించడం సర్వే సందిగ్ధంలో పడింది. కేంద్ర ప్రభుత్వం సమగ్ర వ్యవసాయంపై రూపొందించిన ఈ యాప్ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులు సాగు చేస్తున్న భూముల వివరాల్ని నమోదు చేయాల్సి ఉంటుంది. సర్వేకు కేంద్రం నిధులు కేటాయించగా కర్ణాటక, ఆంధ్ర తదితర రాష్ట్రాల్లో వ్యవసాయ శాఖ ప్రత్యేక వాలంటీర్లను నియమించి సర్వే చేపడుతోంది. కాగా తెలంగాణలో మాత్రం ఏఈవోలే వీటిని చేయాలంటూ ఆదేశించింది. దీనిని వ్యతిరేకిస్తున్న ఏఈవోలు విధులకు హాజరవుతున్నా గత నెల 24 నుంచి గైర్హాజరు వేస్తున్నారు. విధులను ఖాతారు చేయని అవుట్ సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తొలగిస్తామని మెమోలు జారీ చేశారు. దీంతో రెగ్యులర్ ఏఈవోల్లో ఆందోళన నెలకొంది. అయినప్పటికీ సర్వే మాత్రం ముందుకు సాగడం లేదు.

- గ్రామాల్లో వ్యవసాయం చేస్తున్న వారి వివరాలే కాకుండా సాగులోకి వస్తున్న భూములు, పంటలు వంటివి డిజిటల్‌లో నమోదు చేయడం వల్ల వ్యవసాయ శాఖ క్షేత్ర స్థాయి పట్టు సాధించడం వీలవుతుందని ఈ సర్వేను నిర్దేశించారు. ఇప్పటి వరకు ధరణి నమోదు ఆధారంగా గ్రామాల్లో వీఆర్ఏ, కావలికారు వంటివారి సహకారంతో రైతు చెప్పిన విధంగా పంటల సాగును వ్యవసాయశాఖ నమోదు చేసేది. వీటన్నింటికీ చెక్‌పెడుతూ సర్వే నంబర్, సాగు ఫొటో ఆధారంగా పంటలు నమోదు చేస్తారు. ఈ సర్వే వివరాల ఆధారంగానే రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసాను ఇద్దామని యోచిస్తోంది.

ఒక్కరికి అసాధ్యమే ! : గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి అక్కడి నుంచే ఫొటోలతో ఆయా రైతు వివరాలను నమోదు చేయాలంటే ఒక్క ఏఈవోల తోనే సాధ్యమయ్యే పనికాదని వారు చెబుతున్నారు. తమకు సహాయంగా మరొకరిని ఇస్తే గాని గ్రామాల్లో ఈ సర్వే పూర్తి చేయలేమన్నది వారి వాదన. ఏఈవోలుగా స్త్రీలు పని చేస్తున్నారని ఒక్కరే అడవులు, చెరువులు, కుంటలు తిరుగుతూ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లడం సులభమైన పని కాదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంటి అటవీ ప్రాంత వ్యవసాయ క్షేత్రాల్లో ఇది మరింత ఇబ్బందికరమని మహిళా ఏఈవోలు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. వ్యవసాయ శాఖలో 49 రకాల పనుల్ని చక్కబెడుతున్న తమకు డీటీఎస్ తీవ్ర ఇబ్బందులు కలిగించే అంశంగా వారు భావిస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు జిల్లాలో వీరు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోలేదు. అందులోనే వ్యక్తిగత హాజరు నమోదు చేయాలని నిర్దేశించినప్పటికీ ఈ విధులకు దూరంగా ఉంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో రైతులు సాగు చేసిన భూమి వివరాలు...

జిల్లా	రైతులు	సాగు భూములు (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్	1,26.549	5,62,299
నారాయణపేట	1,38,267	4,64,440
జోగులాంబ గద్వాల	2,58,901	3,40,677
మహబూబ్‌నగర్	1,76,474	3,21,512
వనపర్తి	1,30,894	2,35,250
మొత్తం	8,31,085	19,24,178

రైతు సేవలో వ్యవసాయ మార్కెట్

ప్రమాణ స్వీకారోత్సవంలో కొత్త ఛైర్మన్ భీమప్ప



కోస్గి వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న ముద్ది భీమప్ప

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : వ్యవసాయ మార్కెట్‌యార్డు ద్వారా రైతుల అభివృద్ధికి కృషి చేస్తామని మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముద్ది భీమప్ప అన్నారు. రైతులకు విస్తృత సేవలు అందిస్తామన్నారు. సోమవారం కోస్గి యార్డు ఆవరణలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారిణి బాలమణి కొత్త పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా భీమప్ప మాట్లాడుతూ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అమలయ్యే విధంగా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా గిరిప్రసాద్‌రెడ్డితో పాటు మరో 16 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ వార్ల విజయ్‌కుమార్, పురపాలకసంఘం ఛైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ, కోస్గి, గుండుమాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రఘువర్ధన్‌రెడ్డి, విక్రమ్‌రెడ్డి, కోస్గి పట్టణ అధ్యక్షులు బెజ్జు రాములు, నాయకులు తుడుం శ్రీనివాస్, కౌన్సిలర్లు భానునాయక్, మాస్టర్ శ్రీనివాస్, హరికుమార్, తహసీల్దార్ బి.శ్రీనివాసులు, మార్కెట్ కార్యదర్శి శివ శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజావాణికి 38 దరఖాస్తులు

నారాయణపేట : జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 38 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను కలెక్టర్ సిక్తాపట్నాయక్‌తోపాటు ఇతర జిల్లా అధికారులకు సమర్పించారు. వివరాలను అడిగి తెలుసుకున్న కలెక్టరు సమస్యల పరిష్కారానికి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఆర్డీవో మధుమోహన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాల్యానికి భరోసా

ఆర్బీఎస్‌కే ద్వారా విద్యార్థులకు వైద్యసేవలు

న్యూస్‌టుడే, పాలమూరు : ప్రభుత్వ పాఠశాలల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులకు రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమం (ఆర్బీఎస్‌కే) అండగా నిలుస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో 7, నాగర్‌కర్నూల్‌లో 10, నారాయణపేటలో 5, వనపర్తిలో 8, జోగులాంబ గద్వాల జిల్లాలో 5 చొప్పున మొత్తం 35 ఆర్బీఎస్‌కే వైద్య బృందాలు పని చేస్తున్నాయి. ప్రతి బృందంలో ఇద్దరు వైద్యులు (ఆడ, మగ), ఒక ఫార్మసిస్టు, ఏఎన్ఎం ఉంటారు. వారికి వాహన సౌకర్యం కూడా ఉంటుంది. బృందాల సభ్యులు వారంలో ఐదు రోజులు ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వెళ్లి చిన్నారులకు వైద్య పరీక్షలు చేస్తారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి సమీపంలోని ఆసుపత్రులకు సిఫారసు చేస్తున్నారు.

రక్తహీనత బాధితులే ఎక్కువ : ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు 1,48,556 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అందులో అనేక రకాల అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న 6,143 మంది చిన్నారులను గుర్తించారు. వారిని మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో నిర్వహించే డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(డైక్)కు పంపించారు. వివిధ విభాగాలకు చెందిన 13 మంది వైద్యులు అవసరమైన చికిత్సలు అందిస్తున్నారు. చిన్నారుల్లో తీవ్ర రక్తహీనత, దంత సంబంధ సమస్యలు, పోషకాహారలోపం ఎదుర్కొంటున్నవారు ఎక్కువ మంది ఉన్నారు.



మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

బాలల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : మా వైద్య బృందాలు రోజూ పాఠశాలలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ప్రతి శనివారం అనారోగ్య బాధితుల వివరాలు మాకు సమర్పిస్తారు. చిన్నారులను కూడా మహబూబ్‌నగర్‌కు తీసుకొస్తారు. వారి అనారోగ్య సమస్యలు పూర్తిగా నయమయ్యే వరకు మెరుగైన చికిత్సలు అందిస్తాం. ప్రత్యేకంగా దృష్టిసారిస్తాం.
- దేవీదాసు, ఆర్బీఎస్‌కే మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా

చిన్నారుల అనారోగ్య సమస్యలివే..

అనారోగ్య సమస్య	బాధితులు
తీవ్ర రక్తహీనత	692
దంత సమస్యలు	682
పోషకాహారలోపం	386
దృష్టిలోపం	156
మాట్లాడలేకపోవడం	156
రుతుచక్ర సమస్యలు	151
నరాలు, ఎముకలు	145
బుద్ధి మాంద్యం	51
ప్రవర్తన సమస్యలు	39
గుండె సమస్యలు	32
అభ్యసన వైకల్యాలు	26
నిరాసక్తత	18
గ్రహణ మొర్రి	14
రక్తమార్పిడి	07
వంకర కాళ్లు	06
కర్ణభేరి సమస్యలు	02

ధన్వాడలో పట్టపగలు చోరీ



బీరువాను పరిశీలిస్తున్న ఎస్సై రమేశ్

ధన్వాడ, న్యూస్‌టుడే : ధన్వాడ పట్టణంలో పట్టపగలు ఓ ఇంట్లో దొంగలు పడి నగదుతో పాటు బంగారు ఎత్తుకెళ్లారు. ఎస్సై రమేశ్ కథనం ప్రకారం కోటపక్క వీధికి చెందిన ఆర్కటి వెంకట్‌రెడ్డి పనిపై జక్లేర్ వెళ్లగా, ఆశా కార్యకర్త అయిన ఆయన భార్య విజయలక్ష్మి నారాయణపేట వెళ్లారు. ఉదయం పదిన్నరకు ఇంటికి తాళం వేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయాన వచ్చి చూడగా ఇంటి తాళం ధ్వంసం అయ్యింది. లోపలి బీరువా తెరిచి ఉంది. బీరువా అరల్లో దాచిన నగదు రూ. 24,500, మూడున్నర తులాల బంగారు దొంగలు ఎత్తుకెళ్లారు. వివాహ వేడుక ఉండటంతో ఇరుగు పొరుగు వారందరు తాళాలు వేసి వెళ్లడంతో దొంగతనాన్ని గమనించడానికి వీలు కాలేదు.

సీసీ కెమెరా దిశ మార్చకుంటే.. : ఇటీవల భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి వీరి ఇంటికి సమీపంలోనే సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. అది తమ స్నానాల గది దిశగా ఉందంటూ వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మిలు కెమెరా దిశను మార్పించారు. మార్చకపోయి ఉంటే ఇంటి తాళం ధ్వంసం చేసిన దొంగల దృశ్యలు అగుపించేవి. వెంకట్‌రెడ్డి ఇంట్లో ఆరు నెలల కిందట దొంగతనం జరిగి నగదు పోయింది. అప్పట్లో ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. ఇప్పుడు మళ్లీ అదే ఇంట్లో దొంగతనం జరగడాన్ని పలువురు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

ప్రశ్నపత్రాల కొరత.. ఉపాధ్యాయుల కలత



కోస్గి ఎంఆర్సీలో ప్రశ్నాపత్రాలను లెక్కిస్తున్న సిబ్బంది

కోస్గి, న్యూస్‌టుడే: విద్యార్థుల ప్రగతిని మదింపు చేసే ఎస్ఏ1 పరీక్షలు సోమవారం జిల్లాలో ప్రారంభమయ్యాయి. ప్రశ్నాపత్రాలు తక్కువగా వచ్చాయని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు మండల వనరుల కేంద్రాల వైపు పరుగులు పెట్టారు. కోస్గి జడ్పీ ఉన్నత పాఠశాలలో 839 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఎనిమిదో తరగతి ఆంగ్లమాధ్యమంలో 105 మంది విద్యార్థులు ఉండగా, కేవలం 55, తొమ్మిదో తరగతిలో 96 మంది విద్యార్థులకు 35 ప్రశ్నాపత్రాలే వచ్చాయి. ఇక్కడే కాదు జిల్లాలోని దామరగిద్ద, మక్తల్, మాగనూరు, కృష్ణా మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. మిగతా పరీక్షలకు ఆ సమస్య రానివ్వబోమని ఎంఈవో శంకర్‌నాయక్ తెలిపారు.

ఒక్కొక్కరుగా దూరమై.. జీవనం భారమై!

మానవీయం

మహమ్మదాబాద్, న్యూస్‌టుడే : అమ్మానాన్నలు, సోదరుడు, తాత, నానమ్మలను వరుసగా కోల్పోయి ఓ యువతి అనాథగా మిగిలిన దయనీయ గాథ ఇది. మహబూబ్‌నగర్ జిల్లా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి చెందిన బి.రాములుది పేద కుటుంబం. ఆయనకు భార్య జయమ్మ, తండ్రి అనంతయ్య, తల్లి మాసమ్మ, కుమారుడు సాయికిరణ్, కుమార్తె స్నేహ ఉన్నారు. కూలి పనులతో వచ్చే అరకొర ఆదాయంతో జీవనం సాగించే ఆ కుటుంబాన్ని మధుమేహం కబలించింది. తాము మధుమేహం బారినపడ్డామన్న విషయాన్ని రాములు, జయమ్మ ఆలస్యంగా గుర్తించారు. అప్పటికే పరిస్థితి చేయిదాటి అనేక అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. 2014లో జయమ్మ చనిపోయారు. మరుసటి సంవత్సరం రాములు మరింత అస్వస్థతకు గురయ్యారు. ఆసుపత్రి ఖర్చులకు ఎకరం పొలాన్ని అమ్మినా ఫలితం లేకపోయింది. 2016లో ఆయన మృతిచెందారు. అమ్మానాన్నలు లేకున్నా అన్న, తాత, నానమ్మ



తల్లిదండ్రుల చిత్రపటంతో స్నేహ

ఉన్నారని స్నేహ అనుకున్నంతలోనే మరొకరిని కోల్పోవాల్సి వచ్చింది. కుమారుడు, కోడలును కోల్పోయిన దిగులుతో వృద్ధుడైన అనంతయ్య 2017లో మరణించారు. కొంతకాలానికి అన్న సాయికిరణ్ అనారోగ్యం పాలయ్యారు. 2024 ఆగస్టు 26న ఆయన చనిపోయారు. వృద్ధాప్యంతో నానమ్మ మాసమ్మ 2024 సెప్టెంబరు 16న మరణించారు. నెల వ్యవధిలోనే అన్న, నానమ్మ దూరమయ్యారు. విధి పగబట్టినట్లుగా కుటుంబంలోని ఒకరి తర్వాత మరొకరిని.. మొత్తం ఐదుగురిని బలి తీసుకోవటంతో స్నేహ అనాథగా మారింది. ఆమెను తీవ్రంగా కుంగదీసింది. ప్రస్తుతం స్నేహ మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ చదువుతోంది. ఉన్నత విద్య అభ్యసించి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ఆమె కలలన్నీ కరిగిపోయి కన్నీరే మిగిలింది. కుటుంబ సభ్యులను తలచుకుని దుఃఖిస్తూ.. శిథిలావస్థకు చేరిన పాత పెంకుటిల్లులో బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా జీవనం సాగిస్తోంది. అనాథగా మారిన స్నేహకు ప్రభుత్వం అండగా నిలవాలని, ఆమెను వసతి గృహంలో చేర్పించి ఉన్నత విద్య చదివించటంతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బంతి తోట.. లాభాల బాట

రైతేరాజు

ధన్వాడ, న్యూస్‌టుడే : గాలి ఉన్నప్పుడే తూర్పార బట్టాలి అనే నానుడిని వంట బట్టించుకున్న నారాయణపేట జిల్లా మరికల్‌కు చెందిన మహిళా రైతు పోలమోని లక్ష్మమ్మ.. బంతి పూలసాగులో ప్రణాళికతో ముందుకెళ్తూ ఏటా లాభాలు అందుకుంటున్నారు. ఈమెకు 2.30 ఎకరాల పొలం ఉంది. ఓ చోట రెండెకరాలు, మరో చోట 30 గుంటల భూమి ఉంది. ఇందులో అర ఎకరాలో బంతిపూలు సాగు చేశారు. బతుకమ్మ వేడుకలు ప్రారంభానికి నలభై రోజుల ముందు నారు నాటుతారు. పూల దిగుబడి అప్పటి నుంచి మొదలైతే దీపావళి, కార్తిక పౌర్ణమి వరకు కొనసాగుతుంది. ఈ సీజన్‌లో వీటికి మంచి డిమాండ్ ఉంటుంది.



తోటలో రైతు లక్ష్మమ్మ

ఖర్చు రూ.20 వేలు.. లాభం రూ.50 వేలు: నారు నాటినప్పటి నుంచి పూలు చేతికి వచ్చే వరకు రూ.20 వేలు ఖర్చు అవుతుందని లక్ష్మమ్మ తెలిపారు. తొలి కాపు పూలు విక్రయించగా చేతికి రూ.30 వేలు దక్కాయని, పెట్టుబడి పోగా రూ.పది వేలు ఆదాయం వచ్చిందని చెప్పారు. ప్రస్తుతం రెండో కాపులో పూలు విరగకాశాయని వీటిని విక్రయిస్తే కనిష్ఠంగా మరో రూ.40 వేలు లాభం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ నీటి తడులు అందిస్తే మూడో కాపు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పూలకు డిమాండ్ ఉంటే మరో రూ.30 వేలు వస్తాయన్నారు. గతేడాది మూడు కాపులు బాగా కాశాయని ఆమె తెలిపారు.

గత ఏడాది రూ.లక్ష వరకు విక్రయాలు: నా పొలం పట్టణానికి సమీపంలో ఉండటంతో రోజూ నా భర్త ఉదయం, సాయంత్రం వెళ్లి పర్యవేక్షిస్తారు. బంతిపూల సాగుకు శ్రమ పడాల్సిన అవసరం ఉండదు. గతేడాది రూ.లక్ష వరకు విక్రయాలు జరిగాయి. పెట్టుబడి పోగా రూ.80 వేలు దక్కాయి. ఈ సారి రెండో కాపు వరకు రూ.70 వేలు చేతికి దక్కుతాయి. మూడో కాపులో డిమాండ్ ఉంటే రూ.లక్ష వరకు అమ్మకాలు జరుగుతాయి.

- పోలమోని లక్ష్మమ్మ, మరికల్

ముర్రుపాలు దూడలకు మేలు

బాలానగర్, న్యూస్‌టుడే : లేగ దూడలకు పోషణపరంగా శ్రద్ధ తీసుకుంటే అవి సకాలంలో మంచి పాడిపశువులుగా ఎదుగుతాయని పశువైద్యాధికారి రఘురాం కుమార్ తెలిపారు. చూడి పశువులకు ఏడో నెల నుంచే అదనంగా దాణా ఇవ్వాలని సూచించారు. దూడల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపొందించేందుకు రోజుకు రెండు, మూడు సార్లు చొప్పున మొదటి మూడు రోజులు ముర్రుపాలు తాగించాలి. పుట్టిన గంటలోపే ఇవ్వాలి. తాగలేని దూడలకు తల్లి వద్ద నిలబెట్టి తాగేలా సహకరించాలి. లేదంటే సీసాలో పోసి పాల పీక అమర్చి తాపాలి. వీటిలో శక్తినిచ్చే పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. ముఖ్యంగా దూడలను వ్యాధుల బారి నుంచి రక్షించే 'అంటినాడిస్' ఇందులో ఉంటాయి. వీటిని తాగని దూడల్లో పారుడు వ్యాధులు, ఏలిక పాములు ఆశిస్తాయి. వీటి వల్ల దూడలకు మలబద్ధకం సమస్య ఉండదని రఘురాం కుమార్ తెలిపారు.

సాగులో.. సమస్యలా?

మదనాపురం : సాగులో యాజమాన్య పద్ధతులపై అన్నదాతలు ఆదివారం మినహా మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య చరవాణి నం : 94408 35658కి ఫోన్ చేస్తే సందేహాలను నివృత్తి చేస్తామని కేవీకే కీటక శాస్త్రవేత్త డాక్టర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

మేలైన వంగడాల ఎంపిక కీలకం

మహబూబ్‌నగర్ వ్యవసాయం, న్యూస్‌టుడే : రబీలో మేలైన వంగడాలు ఎంచుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకటేశ్ సూచించారు. ఈ ఏడాది మంచి వర్షాలు కురవడంతో ఎలాంటి నీటి సమస్య ఉండదని తెలిపారు. రైతులు ప్రస్తుతం నాణ్యమైన ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు ఎంచుకోవాలని ఆయన పేర్కొన్నారు.



ఉల్లి సాగు

- వరిలో అగ్గి తెగులును తట్టుకుని అధిక దిగుబడి ఇచ్చే వంగడాలు ఎంచుకోవాలి. ఇందులో స్వల్పకాలిక (120 రోజులు) రకాలు ఎంచుకుంటే మేలు. కాటన్ దొర సన్నాలు (ఎంటీయూ-1010), విజేత (ఎంటీయూ-1001), ఐఆర్-64, ప్రభాత్ (ఎంటీయూ-3626), నెల్లూరి మసూరి (ఆర్‌పీఎన్‌ఆర్-34449), తెల్లహంస (ఆర్‌ఎన్‌ఆర్-10754), ఎర్రమల్లెలు (డబ్ల్యూఎల్-20471), జగిత్యాల సన్నాలు (జేజీఎల్-1798) మంచి ఫలితాలు ఇస్తాయి.
- జగిత్యాల సాంబ, అంజన, శ్వేత, తరంగ్, తెలంగాణ సోనా, బతుకమ్మ వంటి రకాలు సాగుకు అనుకూలం.
- మొక్కజొన్న, వేరుసెనగ, పప్పు శనగ, పొద్దుతిరుగుడు, మినుములు, నువ్వులు, ఆవాలు, రాగి, తెల్లజొన్న, ఉలువ, పెసర వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. అపరాల సాగు లాభదాయకంగా ఉంటుంది.
- ఉల్లి సాగు ఎంతో లాభదాయకం. ఎకరానికి సుమారు 100-150 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. మార్కెట్లో ఇప్పుడు మేలైన వంగడాలు వచ్చాయి. ఎరుపు రంగు గడ్డకంటే లేత ఎరుపు రంగు ఉల్లికి మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. ఎలాంటి మందులు పిచికారీ చేయాల్సిన అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

ప్రశ్నలు - సమాధానాలు

? వరిలో పాము పొడ తెగులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- మాసన్న, దుప్పల్లి

✔ లీటరు నీటికి థప్లూజమిడ్ 0.75 మి.లీ లేదా హెక్సాకోనోజోల్ 2 మి.లీ లేదా ప్రొపికోనోజోల్ 1 మి.లీ లేదా ట్రైప్లాక్సీస్ట్రాబిన్ + టెబ్యూకోనోజోల్ 0.4 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? వేరుసెనగలో పొగాకు లద్దె పురుగు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

- బాలరాజు, నిర్వేన్

✔ న్యూవులురాన్ 1 మి.లీ లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.5 గ్రాములు లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

? టమాటాలో ఆకుమాడు తెగులు నివారణకు చర్యలు తెలపండి

- వెంకటయ్య, చెన్నారం

✔ లీటరు నీటిలో కాప్టాన్ 3 గ్రాములు లేదా కార్బండిజియం + మ్యాంకోజెబ్ 2.5 గ్రాములు లేదా ప్రొపికోనోజోల్ ఒక మి.లీ లేదా అజాక్సిస్ట్రోబిన్ + టెబ్యూకోనోజోల్ 1.2 మి.లీ మందును కలిపి ఆకులు బాగా తడిచేటట్లు పిచికారీ చేయాలి.



- డాక్టర్ రాజేందర్‌రెడ్డి, కీటక శాస్త్రవేత్త, కేవీకే మదనాపురం

- న్యూస్‌టుడే, మదనాపురం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యకు కృషి

సినీనటి మంచు లక్ష్మి

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య, మౌలిక వసతుల కల్పనకు తమ సంస్థ కృషి చేస్తోందని టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, సినీనటి మంచు లక్ష్మి పేర్కొన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండలం ఆలూరు గ్రామంలో డిజిటల్‌క్లాస్ నిర్మాణం ప్రారంభించేందుకు వచ్చిన ఆమె సోమవారం జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పెగసిస్ సిస్టం కంపెనీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించారు. గతంలో గట్టు మండలంలో 30 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌ల నిర్మాణం చేపట్టామని.. త్వరలో మరో 20 పాఠశాలలు నిర్మిస్తామని ఆమె చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సంస్థ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో 140 మంది ఉపాధ్యాయులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. స్వచ్ఛంద సంస్థ ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అదనపు కలెక్టర్ నర్సింగరావు, జడ్పీ సీఈవో కాంతమ్మ, డీఈవో రవీందర్‌లు పాల్గొన్నారు.



గద్వాల కలెక్టర్ సంతోష్‌తో మాట్లాడుతున్న సినీనటి మంచు లక్ష్మి

శిక్షణ ఐఏఎస్, ఐపీఎస్‌ల పర్యటన



ఉండవల్లి బస్వాపురంలో శిక్షణ అధికారులకు పూలమొక్కలు అందజేసి, బతుకమ్మతో స్వాగతిస్తున్న అధికారులు

ధరూరు, ఉండవల్లి, మానవపాడు, ఇటిక్యాల, న్యూస్‌టుడే: ధరూరు మండల పరిధిలోని ఉప్పేరులో శిక్షణ ఐఏఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. తెలంగాణలోని ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాదు, జోగులాంబ గద్వాల జిల్లాలలో ఎంపిక చేసిన గ్రామాల్లో గ్రామానికి 5 మంది చొప్పున 125 మంది శిక్షణ అధికారులు వచ్చారు. 3 రోజుల పాటు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల అమలు, సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు, కనీస వసతుల కల్పన తదితర అంశాలపై నివేదిక రూపొందించనున్నారు.

- ఉండవల్లి మండలం బస్వాపురం గ్రామానికి శిక్షణ అధికారులు లోకేష్‌కుమార్ (ఐఎస్ఎస్), రామకృష్ణ శరన్ (ఐపీఎస్), ప్రతీక్ గహ్లోట్(ఐపీఎస్), అతుల్ కుమార్‌సింగ్ (ఐఆర్ఎస్ ఐటీ), హిమాన్షు త్యాగి (ఐఎఫ్ఓఎస్) సోమవారం వచ్చారు. మానవపాడు మండలానికి 5 మంది శిక్షణ ఐఏఎస్ అధికారులు రాజీవ్.కె, వల్లి.ఎన్, ప్రసన్నకుమార్.వి, విజయ్ లధా, సాయలి అశోక్ గైక్వాడ్‌లు మండలంలోని కలుకుంట్ల గ్రామానికి సోమవారం చేరుకున్నారు. ఇటిక్యాల మండలంలోని కోదండాపురంకు సోమవారం శిక్షణా సివిల్ సర్వీస్ అధికారులు వచ్చారు. 2021 బ్యాచ్‌కు చెందిన లోకేష్ యాదవ్ (ఐపీఎస్), డింపుల్ యాదవ్(ఐఎస్ఎస్), బస్వారాజ్ ఎం వాలీకర్(ఐపీవోఎస్), నిఖితా యాదవ్(ఐసీఎల్ఎస్), 2022 బ్యాచ్‌కు చెందిన ఇంద్రజిత్ సిరా(ఐఎఫ్‌వోఎస్)లు ఉన్నారు. మల్దకల్ మండల పరిధిలోని పెద్దతాండలో శిక్షణ ఐపీఎస్ అధికారులు సోమవారం పర్యటించారు. వికాస్, పాల్వాయి విష్ణువర్ధన్‌రెడ్డి, ఐఎఫ్ఓఎస్ ఆదాం మోహియిద్దీన్, ఐపీఓఎస్ పుష్కర వర్మ, ఐపీఎస్ హర్షత్‌కుమార్ ఆలావాత్, తాండాలో పర్యటించి ఆర్థిక, సామాజిక అంశాలపై ముచ్చటించారు.

శ్రీశైలంలో నీటి విడుదల

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతోంది. ఎగువన ఉన్న జూరాల, సుంకేశుల జలాశయాలు పూర్తిగా నిండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. దీంతో శ్రీశైలం జలాశయంలో నీటి మట్టం పూర్తిస్థాయికి చేరింది. వరద ప్రవాహం కొనసాగుతుండటంతో ప్రాజెక్టు 5 క్రస్ట్‌గేట్లను 10 అడుగుల మేర ఎత్తి నీటిని దిగువన ఉన్న నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు నుంచి 1,17,539 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 51,324 క్యూసెక్కుల ప్రవాహం వస్తుంది. శ్రీశైలం కుడి ఎడమ జల విద్యుత్ కేంద్రాల ద్వార 66,203 క్యూసెక్కులు, స్పిల్ వే ద్వార 1,38,770 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు జలాశయంలో నీటి మట్టం 884.30 అడుగులకు, నీటి నిల్వ 211.4759 టీఎంసీలుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కొలువులు ఇచ్చే కొత్త కోర్సులు

- టాటా సంస్థ భాగస్వామ్యంతో మూడు ఐటీఐల్లో అమలు
- 30వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ




ఐటీఐ కళాశాలలో కొత్త కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న యువతులు

న్యూస్‌టుడే, పాలమూరు: విస్తృత ఉపాధి అవకాశాలు లభించే ఆరు అధునాతన సాంకేతిక కోర్సులు పాలమూరు యువతకు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం దిగ్గజ కంపెనీ టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐలను అధునాతన సాంకేతిక కేంద్రాలు (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్ - ఏటీసీ)గా ఉన్నతీకరిస్తున్నారు. తొలి విడతగా ఈ ఏడాది 28 కళాశాలలు ఎంపిక చేయగా అందులో మహబూబ్‌నగర్(బాలికల), మన్ననూర్, వనపర్తి ఐటీఐలు ఉన్నాయి.

ఒక్కో కళాశాలలో 172 సీట్లు : ఒక్కో కళాశాలలో ఆరు కొత్త కోర్సుల్లో కలిపి 172 సీట్లు అందుబాటులోకి రానున్నాయి. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన యువత ప్రవేశాలకు అర్హులు. ఈ నెల 30 వరకు దరఖాస్తులను అంతర్జాలం నుంచి స్వీకరిస్తారు. తర్వాత కోర్సులు ప్రారంభమవుతాయి. ఉమ్మడి జిల్లాలో బాలికల ఐటీఐ కళాశాల మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోనే ఉంది. ఈ కోర్సుల్లో మూడేళ్ల పాటు టాటా ప్రతినిధులే శిక్షణ ఇస్తారు. తర్వాత వివిధ పరిశ్రమల్లో వారికి ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తారు. ఎస్ఎస్‌సీ, కుల, బోనఫైడ్, స్థానికత ధ్రువీకరణ పత్రాలు, టీసీ, ఫొటో స్కాన్ చేసి http://iti.telangana.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

23న పనులకు శంకుస్థాపన : మహబూబ్‌నగర్ ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రాంగణంలో బాలికలు, బాలురకు వేర్వేరుగా శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు వెచ్చించే నిధులను 85 శాతం టాటా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తాయి. వాటిలో అన్ని రకాల యంత్ర సామగ్రి, పరికరాలు, ఫర్నిచర్, ఇతర సదుపాయాలు కల్పిస్తారు. ఈ పనులకు ఈ నెల 23న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మహబూబ్‌నగర్‌లో శంకుస్థాపన చేయనున్నారు.



కోర్సు	సీట్లు
మ్యానుఫ్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ - ఏడాది	40
ఇండస్ట్రియల్ రోబోటిక్స్, డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ - ఏడాది	40
బేసిక్ డిజైనర్, వర్చ్యువల్ వెరిఫైర్ - రెండేళ్లు	24
ఆర్టిసన్ యూసింగ్ అడ్వాన్స్ టూల్స్ - ఏడాది	20
అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్ - రెండేళ్లు	24
మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ - రెండేళ్లు	24

సద్వినియోగం చేసుకోవాలి.. : రాబోయే కాలంలో భారీ డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకుంటే కొలువులు లభిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం, టాటా కంపెనీ కలిసి నిర్వహించే ఆరు కొత్త కోర్సులను ఉమ్మడి జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలి. అర్హులందరూ త్వరగా దరఖాస్తు చేసుకోవాలి. సందేహాల నివృత్తికి 83742 50330, 95500 54418, 98484 66028 నంబర్లలో సంప్రదించొచ్చు.



- గోపాల్ నాయక్, ప్రభుత్వ బాలికల ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, మహబూబ్‌నగర్

మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులకు అస్వస్థత

వివరాలు గోప్యంగా ఉంచిన ఉపాధ్యాయులు

బిజినేపల్లి, న్యూస్‌టుడే : మధ్యాహ్న భోజనం తిని విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటన బిజినేపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనం చేసిన చిన్నారుల్లో 15 మంది వాంతులు చేసుకున్నారు. ఉపాధ్యాయులు బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం విద్యార్థులను పాఠశాల వద్ద వదిలిన ఉపాధ్యాయులు ఎంఈవోకు గాని, తల్లిదండ్రులకు గాని సమాచారం ఇవ్వకుండానే సాయంత్రం ఇంటికి వెళ్లిపోయారు. పొలం పనులకు వెళ్లిన తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో కొందరు విద్యార్థులు పాఠశాల ఆవరణలోనే వేచి ఉన్నారు. గ్రామస్థులు ఆరా తీయడంతో విషయం బయటకు తెలిసింది. ఎంఈవో రఘునందన్‌శర్మను వివరణ కోరగా, విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం ఆలస్యంగా తెలిసిందన్నారు. మంగళవారం పాఠశాలను సందర్శించి బాధ్యులపై చర్యలు తీసుకుంటానన్నారు.



శాయిన్‌పల్లి పాఠశాల వద్ద అస్వస్థతకు గురైన విద్యార్థులు

ఆటో ఢీకొని మహిళ మృతి

ముగ్గురు పిల్లలకు గాయాలు

కృష్ణా, న్యూస్‌టుడే : హిందుపూర్, టైరోడ్ మధ్య ఆటో ఢీకొని కర్రెమ్మ(60) అనే మహిళ మృతి చెందింది. కృష్ణా పోలీసుల కథనం ప్రకారం సోమవారం సాయంత్రం కర్ణాటకలోని శక్తినగర్ నుంచి ప్రయివేటు పాఠశాల విద్యార్థులను హిందుపూర్‌కు ఆటో తీసుకువస్తుండగా మహిళ అడ్డం రావడంతో ఆటో అదుపు తప్పి ఆమెను ఢీకొని బోల్తాపడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ కర్రెమ్మను ప్రయివేటు వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలిది గుడేబల్లూర్‌గా పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ముగ్గురు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కతలప్ప తెలిపారు.

బాలికతో వెట్టి.. ఆపై దొంగతనం నెపం

- మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం
- జోగులాంబ గద్వాల జిల్లాలో దారుణం

గద్వాల అర్బన్, న్యూస్‌టుడే: గద్వాలలోని ఓ సీడ్ ఆర్గనైజర్ తన ఇంట్లో బాలిక(16)తో వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు దొంగతనం నెపం మోపడంతో ఆ బాలిక పురుగు మందు తాగింది. సామాజిక మాధ్యమాల్లో సోమవారం వైరల్‌గా మారిన ఈ ఘటన జోగులాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మల్దకల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక గద్వాలలో నివాసం ఉంటున్న సీడ్ ఆర్గనైజర్ బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో గత కొన్నేళ్లుగా పని చేస్తోంది. తన ఇంట్లో బంగారు ఆభరణాలు పోయాయని, ఇంట్లో పని చేసే బాలికే ఈ పనికి పాల్పడిందని మల్దకల్ ఠాణాలో ఆయన ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలికను ఠాణాకు పిలిపించి విచారించారు. తర్వాత చోరీ ఘటన తమ పరిధిలో లేదంటూ సీడ్ ఆర్గనైజర్‌కు వివరించారు. తాను దొంగతనం చేయకున్నా నింద మోపారని మనస్థాపం చెందిన బాలిక ఈనెల 12న తన ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న బాలికను కుటుంబ సభ్యులు గద్వాల జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఏపీలోకి కర్నూలుకు తీసుకెళ్లారు. బాలిక ఆరోగ్యం మరింతగా విషమించడంతో వైద్యులు ఏఎంసీలో ఉంచి వెంటిలేటరుపై చికిత్స అందిస్తున్నారు. సోమవారం ఈ విషయం వెలుగులోకి రావడంతో బాలిక తల్లి మల్దకల్ ఠాణాలో ఇంటి యజమానిపై ఫిర్యాదు చేశారు. ఈ విషయమై గద్వాల డీఎస్పీ సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లగా సంఘటనపై విచారణ జరుపుతున్నామని, బాలిక తల్లి ఫిర్యాదుపై వెట్టిచాకిరి చేయించుకుని దొంగతనం నెపంతో బాలిక ఆత్మహత్యాయత్నానికి కారకుడైన సీడ్ ఆర్గనైజర్‌పై మల్దకల్ ఠాణాలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రైలు కింద పడి ఒకరి ఆత్మహత్య

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : రైలు కింద పడి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మహబూబ్‌నగర్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం.. సుమారు 35 ఏళ్ల వయస్సు ఉండే గుర్తుతెలియని పురుషుడు బండమీదిపల్లి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యులు ఉంటే రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

పూర్తికాని రోడ్డు విస్తరణ.. కోస్గి వాసులకు ఆవేదన



రామాలయం కూడలి వద్ద విస్తరణకు నోచుకోని రోడ్డు ● పురపాలిక కార్యాలయం వద్ద అసంపూర్తిగా..

న్యూస్‌టుడే, కోస్గి

కోస్గికి కోట్లకు కోట్ల రూపాయలు వస్తున్నాయి. ప్రణాళిక తయారయ్యింది... ఇవన్నీ కార్యరూపం దాల్చడానికి చాలా సమయం పడుతుంది. కాదనలేం. కానీ ప్రస్తుతం చేపట్టిన రోడ్డు విస్తరణ ఆగిపోవడం పట్టణవాసులను కలవరపెడుతుంది. పనులు చేపట్టి సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా పూర్తికాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి పరిగి దారిలోని దర్గా వరకు విస్తరణకు దాదాపు నాలుగేళ్ల క్రితం రూ. పది కోట్లు మంజూరు అయ్యాయి. నష్టపరిహారం కోసం నివాసితులు ఆందోళన చేయడంతో విస్తరణ పనులు ఆలస్యమయ్యాయి. వీటిని అధిగమించి కాస్త ముందడుగు వేశారు. కొంత వరకు పనులను పూర్తిచేసిన గుత్తేదారు ఆ తర్వాత వదిలేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి రామాలయం కూడలి, పురపాలిక కార్యాలయం సమీపంలో పనులు అసంపూర్తిగా ఆగిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు ఉన్న చోట దుమ్ము, ధూళితో సతమతమవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఇరుకైన రోడ్డు ఉండడంతో అటు వాహనదారులకు, ఇటు ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

● ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలల సమయంలో విద్యార్థులు, వారిని చేరవేసే వాహనాల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లాలంటే ఇదే ప్రధాన దారి. తరచూ ట్రాఫిక్ నిలిచిపోయి అత్యవసర పనులపై వెళ్లే వారికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉత్సవం, ఆధ్యాత్మిక, రాజకీయ ఊరేగింపులు జరిగినా ఇదే ప్రధాన దారి. ఆ సమయాల్లో వాహనదారులకు నరకం కనిపిస్తోంది.

ఆదివారం వస్తే హడలే

ప్రతి ఆదివారం కోస్గిలో సంత జరుగుతుంది. చుట్టుపక్కల నుంచి పెద్ద ఎత్తున జనం వచ్చిపోతుంటారు. చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి దుకాణాలను ఏర్పాటు చేసుకుంటారు. రామాలయం కూడలి నుంచి శివాజీ కూడలి వరకు అడుగుదూరం ముందుకు వెళ్లలేని పరిస్థితి కనిపిస్తోంది. పట్టణంలో రోజురోజుకూ వాహనాల సంఖ్య పెరుగుతుంది. ప్రజలు మహబూబ్‌నగర్, తాండూరు, హైదరాబాద్, నారాయణపేట ఈ దారి మీదుగా వెళ్లాలి. వీటికి తోడు బస్సులు, పెద్ద వాహనాల రాకపోకలతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

కలెక్టర్, కడా అధికారులకు నివేదించాం

పట్టణంలోని రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, ఇళ్లు నష్టపోయిన వారికి పరిహారాన్ని అందించాలని కోరుతూ జిల్లా కలెక్టర్, కడా ప్రత్యేక అధికారిని కోరాం. కొందరు వ్యాపారులు కోర్టుకు వెళ్లడంతో సమస్య నెలకొంది. వెంటనే పరిహారాన్ని మంజూరు చేయించి విస్తరణ పనులు పూర్తయ్యేలా చూస్తాం. సంత రోజున పోలీసుల సహకారంతో పెద్ద వాహనాలను రామాలయం కూడలి వద్ద దారి మళ్లిస్తాం.

- కొడిగంటి అన్నపూర్ణ, పుర ఛైర్‌పర్సన్, కోస్గి

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు

పేట పట్టణం : 9441816587 | మక్తల్ గ్రామీణం : 7680923728
ధన్వాడ : 8008573834 | దామరగిద్ద : 8008573836



? లాల్‌కోట క్రాస్ నుంచి కోయల్‌సాగర్ వరకు బీటీ రోడ్డును మరమ్మతు చేయాలి. అడుగడుగున గుంతలు పడటంతో చినుకు పడితే నీళ్లు నిండి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. బస్సు సర్వీసులు తగ్గాయి

- తిరుపతిరెడ్డి, గోటూర్

✔ ఇది నీటిపారుదలశాఖ రహదారి. పీఆర్‌లోకి మార్చాలని గోటూర్, కొంద్రోన్‌పల్లి, పూసల్‌పాడు, రాకొండ గ్రామస్థులు తీర్మానాల ద్వారా కోరారు. పై అధికారులకు నివేదించాం. ఈ ప్రక్రియ పూర్తయితే నిధులకు ప్రతిపాదనలు పంపిస్తాం.

- ప్రవీణ్‌కుమార్ పీఆర్ ఏఈ, ధన్వాడ



? ధన్వాడలోని ఉపాధి హామీ, ఐకేపీ భవనాల పై కప్పు శిథిలమయ్యింది. వర్షం వస్తే నీళ్లు నిలిచిపోతున్నాయి.

- చంద్రశేఖర్, ధన్వాడ

✔ ఈ విషయాన్ని గుర్తించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నిధులు రాగానే మరమ్మతులు చేయిస్తాం

- సిద్ధేశ్వర్, ఉపాధి హామీ అధికారి, ధన్వాడ



? స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో గదుల కొరత నెలకొంది. మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్టు ఓ తరగతి గదిని వంట సామగ్రి నిల్వకు కేటాయించారు. చెట్ల కింద బోధన చేయాల్సి వస్తోంది. పాతగదులు కూల్చి, కొత్తవి కట్టకుండా చేశారు. - వెంకటేశ్, ధన్వాడ

✔ గత కలెక్టర్ రెండు గదులు మంజూరు చేస్తామని చెప్పడంతో పాత గదుల్ని కూల్చారు. మరోసారి ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. - నర్సింహాచారి జీహెచ్ఎం, ధన్వాడ

- న్యూస్‌టుడే, ధన్వాడ

తెరపై ఈనాడు

దేవర: మనోహర్ 70 ఎంఎం(నారాయణపేట), వెంకటరమణ(మక్తల్), వనయాంబ(కోస్గి), శ్వాగ్: మహేశ్వరి(నారాయణపేట), విశ్వం: రాఘవేంద్ర(మక్తల్)

-న్యూస్‌టుడే-పాతబస్టాండ్, మక్తల్ గ్రామీణం, కోస్గి న్యూటౌన్

కూరగాయల ధరలు(కిలోకు)



టమాట రూ.70, వంకాయలు రూ.60, ముళ్ల వంకాయలు రూ80, ఆలుగడ్డ రూ.50, కాకరకాయ రూ.80, క్యారెట్ రూ.80, బెండకాయలు రూ.60, బీరకాయలు రూ.80, దొండకాయలు రూ.60, పచ్చిమిర్చి రూ.50, చిక్కుడు రూ.70, పెద్ద చిక్కుడు రూ.80, గోకరకాయ రూ.70, క్యాప్సికం 80, బీన్స్120, కాలీఫ్లవర్ రూ.80, దోసకాయ రూ.60. క్యాబేజీ రూ.50, ఉల్లి రూ.50, చింతపండు రూ.110

- న్యూస్‌టుడే, నారాయణపేట (పాతబస్టాండ్)



చౌడేశ్వరిదేవి అఖండజ్యోతి ఉత్సవాలలో తొగుటవీర క్షత్రియులు

చౌడేశ్వరిదేవి అఖండ జ్యోతి ఉత్సవాలు

కోస్గి న్యూటౌన్, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయంలో అఖండజ్యోతి ఉత్సవాలలో భాగంగా తొగుట వీర క్షత్రియులు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, కాకడ హారతి అనంతరం భక్తులు జల్దిబిందె కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం అఖండజ్యోతుల ఊరేగింపు నిర్వహిస్తామని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోస శశిధర్, డాకు బాల్‌రాజ్, ఎర్రజోళ్ళ రవికుమార్, దేవరకొండ రామకృష్ణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం: కాంగ్రెస్

మద్దూరు, న్యూస్‌టుడే: కొడంగల్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక భారాస నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నరని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. సోమవారం కొత్తపల్లిలో సమావేశం నిర్వహించారు. పదేళ్ల భారాస పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అభివృద్ధి పనులకు రూ. కోట్లు వచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలని హితవు పలికారు. నాయకులు మహేందర్ రెడ్డి, చెన్నప్ప, శ్రీనివాస్‌రెడ్డి, షేక్‌మిరాన్, తిరుపతిరెడ్డి, తిమ్మారెడ్డి, కిష్టయ్య, నిలారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు

మహిళా సంఘానికే అప్పగించాలి

ధన్వాడ, న్యూస్‌టుడే : మందిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మహిళా సంఘానికి కేటాయించాలని మండల భాజపా ఉపాధ్యక్షుడు మక్తల్ వెంకటేష్ కోరారు. గతరెండు పర్యాయాలు మహిళలు నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకున్నారన్నారు. ఈ సారి మందిపల్లి గ్రామాన్ని ధన్వాడ విండోకు కేటాయించడం తగదన్నారు.

వీధి దీపాలు లేక అవస్థలు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని జక్లేర్ గ్రామంలో వీధి దీపాలు లేక అవస్థలు పడుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. పలు కాలనీల్లో వీధి దీపాలు వెలగక వృద్ధులు, వికలాంగులు రాత్రి వేళల్లో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. సంబంధిత అధికారులు సమస్య పరిష్కరించాలన్నారు.

రాష్ట్ర స్థాయి సైక్లింగ్ పోటీలకు ముశ్రీఫా విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

కోస్గి, న్యూస్‌టుడే: విద్యార్థులు సైక్లింగ్ పోటీలో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవ్వడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య అన్నారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్వేత, లోకేష్, గీతాంజలికి జ్ఞాపికలు అందించి అభినందించారు. నవంబర్ 4 నుంచి జనగామలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ పుష్పలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్వ, న్యూస్‌టుడే : మక్తల్ పట్టణంలో ఈనెల 20న జరిగిన జిల్లాస్థాయి సైక్లియింగ్ పోటోల్లో నర్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు విశ్రాంత పీఈటీ గోపాలం, నర్వ పీడీ స్వరూప తెలిపారు. ఎంపికైన సి. స్వప్న, కె.శిరీష, అశ్విని, మహేశ్, ప్రవల్లికలను అభినందించారు. పాఠశాల జీహెచ్ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు మల్లేష్, శ్రీనివాసులు, శ్రీశైలంలు మాట్లాడుతూ విద్యార్థులు మరిన్ని శిఖరాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

'అయోడిన్ ఉప్పు వాడితే ఆరోగ్యం'



పేట: జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న శిక్షణ కలెక్టర్ గరిమా నరుల

నారాయణపేట, న్యూస్‌టుడే : అయోడైజ్డ్ ఉప్పు వాడకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని శిక్షణ కలెక్టరు గరిమా నరుల, డీఎంహెచ్ఎం డా.సౌభాగ్యలక్ష్మి అన్నారు. సోమవారం ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పేట ఆర్డీవో కార్యాలయం వద్ద ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ అయోడైజ్డ్ ఉప్పును వాడటంతో శారీరక, మానసిక ఆరోగ్యం, సరైన పెరుగుదల, చురుకుతనం, జ్ఞాపకశక్తి వంటివి చేకూరుతాయన్నారు. సాధారణ ఉప్పుతో అనర్థాలు ఉన్నాయన్నారు. డా. రాఘవేందర్‌రెడ్డి, పీవో భిక్షపతి, ఎన్‌సీడీ సమన్వయకర్త జి. వసంత, డాక్టర్లు మల్లికార్జున్, బాలాజీ, ప్రకాశ్, శివకుమార్, విజయప్రకాశ్, ఏఎన్ఎం, ఆశాలు, జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మరికల్ కూడలి, న్యూస్‌టుడే : ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మరికల్ పట్టణంలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఇందిరా గాంధీ చౌరస్తా వద్ద వైద్యాధికారిణి హర్షిత మాట్లాడారు. పర్యవేక్షకులు అరవింద్, బస్వరాజ్, సువర్ణలతో పాటు ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లోపంతో రుగ్మతలు

ధన్వాడ, న్యూస్‌టుడే : అయోడిన్ లోపంతో రుగ్మతలు వస్తాయని ధన్వాడ పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సింధూజ అన్నారు. ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతల నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అయోడిన్ లోప నివారణకు చిలగడదుంప, క్యారెట్, క్యాబేజీ, బీట్‌రూట్, కాలీఫ్లవర్‌లతో పాటు లేత ఆకుకూరలను ఆహారంలో తీసుకోవాలన్నారు. దీనికి ముందు పీహెచ్‌సీ సిబ్బంది ఆసుపత్రి నుంచి పాఠశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకాధికారిణి గంగమ్మ, పర్యవేక్షకులు కతలప్ప, అశోక్‌కుమార్‌లతో పాటు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కోస్గి నుంచి కొత్త బస్సు సర్వీసులు



కొత్త బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న అధికారులు, నాయకులు

కోస్గి, న్యూస్‌టుడే: కోస్గి బస్ డిపో పరిధిలో రెండు కొత్త సర్వీసులను జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు వార్ల విజయకుమార్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కోస్గి నుంచి జాదవరావుపల్లి మీదుగా మద్దూరు, మరో సర్వీసును కోస్గి నుంచి గుండుమాల్, కొమ్మూరు, వీరారం, కోయిలకొండ మీదుగా మహబూబ్‌నగర్‌కు నడిపిస్తారు. వీటి ఏర్పాటుతో గ్రామీణ ప్రాంత ప్రజలకు రవాణా సౌకర్యం మరింత మెరగుపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆర్ఎం శ్రీదేవి, డిపో మేనేజర్ లావణ్య, కాంగ్రెస్ నాయకులు రఘువర్ధన్‌రెడ్డి, నాగులపల్లి నరేందర్, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్, భానునాయక్, మాస్టర్ శ్రీనివాస్, బాలేష్, ప్రకాష్‌రెడ్డి, మేకల రాజేశ్ ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

మద్దూరు, న్యూస్‌టుడే: జాదరావుపల్లి గ్రామానికి వచ్చిన కొత్త ఆర్టీసీ బస్సును గ్రామస్థులు పూలతో అలంకరించి పూజలు చేశారు. ఈ బస్సు ప్రతి రోజు ఉదయం 7గంటలకు కోస్గిలో బయలుదేరి గుండుమాల్, దోరేపల్లి హన్మానాయక్‌తండా మీదిగా జాదరావుపల్లి చేరుకుంటుంది. తరువాత మద్దూరుకు చేరుకుని రావల్‌పల్లి మీదిగా హైదరాబాద్ వెళ్తుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు శ్రీనునాయక్, వెంకట్, గోపాల్, సుక్కప్ప, బాలప్ప తదితరులు పాల్గొన్నారు

సీఎం, ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు తగవు

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిలపై భారాస నాయకులు అనుచితంగా మాట్లాడటం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. సోమవారం కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రెండు పడకగదుల ఇండ్లు, ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడెకరాల భూమి ఇలా అనేక హామీలు ఇచ్చి భారాస నాయకులు ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మరోమారు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు రవికుమార్, నాయకులు కోళ్ల వెంకటేష్, కట్ట సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కమిటీని రద్దు చేయండి

నర్వ, న్యూస్‌టుడే : లంకాలలో ఎలాంటి సమాచారం లేకుండా వేసిన ఇందిరమ్మ కమిటీని రద్దుచేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు వి.రవికుమార్‌రెడ్డి, మండల నాయకులు విజయ్‌ సోమవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. పకడ్బందీగా పారదర్శకంగా ప్రజలకు అందాలంటే కొత్త కమిటీ వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, హన్మంతు, అయ్యప్పస్వామి, వై. చిన్న, జె. శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని ఎంఈవో అనిల్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జక్లేర్, రామసముద్రం, మాదన్‌పల్లి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెను ప్రకారం భోజనం అందించాలని, ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి పాఠశాలకు హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు చంద్రకళ, నజియా, సిద్రామేశ్వర్, వెంకట్రాములు, నర్సిములు, లక్ష్మణ్, సీఆర్పీ పరిమళ పాల్గొన్నారు.

పొగాకు ఉత్పత్తులు వాడటం వ్యాధులకు కారకం

ఊట్కూరు, న్యూస్‌టుడే : పొగాకు ఉత్పత్తులైన బీడీ, సిగరెట్, గుట్కా తదితర పదార్థాలు తీసుకోవటం వల్ల టీబీ, క్యాన్సర్, శ్వాస సంబంధ వ్యాధులబారిన పడటం ఖాయమని పీహెచ్‌సీ వైద్యురాలు డా.భవాని, ఎంపీహెచ్ఈవో విజయ్ కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పొగాకు ఉత్పత్తులు వినియోగం అనర్థాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. తల్లిదండ్రులు, చుట్టుపక్కన వారు పొగాకు ఉత్పత్తులు వినియోగించకుండా యువత చైతన్యపరచాలన్నారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ నరసింహులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : స్థానిక వ్యాపారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వర్తక సంఘం ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ పట్టణం వ్యాపార పరంగా విస్తరించిన తరుణంలో అనేక మంది రాజస్థాన్, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి వ్యాపారాలు చేస్తూ అద్దెలు పెంచేస్తున్నారన్నారు. స్థానిక వ్యాపారులకు జీవనోపాధి కరవైందన్నారు. కాంగ్రెస్, భాజపా నాయకులు బోయ రవికుమార్, మల్లికార్జున్ కూడా వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు, నాగరాజు, రాములుగౌడ్, నరేష్, విజయ్, నాగేష్, పవన్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

సుంకేసుల గేట్ల ద్వారా 51,300 క్యూసెక్కుల నీటి విడుదల

రాజోలి, న్యూస్‌టుడే : సుంకేసుల జలాశయం గేట్ల ద్వారా సోమవారం 51,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. జేసీ కాల్వకు 2 వేల క్యూసెక్కులు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 54,200 క్యూసెక్కుల నీరు చేరుతోందని, 291.40 మీటర్ల నీటిమట్టం ఉందని చెప్పారు.

చక్కని జీవనశైలి అలవరుచుకోవాలి



మంథన్‌గోడ్‌లో మాట్లాడుతున్న విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ శివరాజ్ విజయకుమార్

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : మహాత్ముడి ఆశయ సాధనకు కృషి చేద్దామని విశ్రాంత జిల్లా విద్యాధికారి డాక్టర్ శివరాజ్ విజయ్‌కుమార్ అన్నారు. బాపూజీ బాటలో సత్యశోధన పాదయాత్ర సోమవారం వంద రోజులకు చేరుకుంది. దాదాపు వెయ్యి కిలోమీటర్లు ఈ పాదయాత్ర సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్‌లో అక్టోబర్ 2 నుంచి ప్రారంభమైన ఈ యాత్ర జనవరి 12న ఉమామహేశ్వరం చేరుకుంటుందన్నారు. రైతులు సేంద్రియ వ్యవసాయం అలవర్చుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. వ్యసనాలు మానాలన్నారు. చేనేత వస్త్రాలు ధరించాలన్నారు. కార్యక్రమంలో పోరం ఎస్ఆర్ఓ వాలంటీర్ శ్యామ్, సుదర్శన్‌గౌడ్, గ్రామపెద్దలు, రైతులు పాల్గొన్నారు.

సరాఫ్ రాజుకు పలువురి నివాళి

నారాయణపేట పట్టణం, న్యూస్‌టుడే : నారాయణపేటకు చెందిన ప్రముఖ బంగారం వ్యాపారి, పట్టణ ప్రముఖుడు వి. విజయానంద్(సరాఫ్ రాజు) ఏకాదశ దినకర్మ సోమవారం నిర్వహించారు. భార్య వి.కవిత, కుమారుడు ఫల్గుణ్ సహా బంధుమిత్రులు, పట్టణ ప్రముఖులు, వ్యాపారులు రాజు చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. హాజరైన ప్రముఖులు ఆయనతో ఉన్న అనుబంధాన్ని, సేవలను గుర్తు చేసుకున్నారు. శక్తిపీఠం ఆధ్వర్యంలో శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. పలు దేవాలయాల్లో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో సంగం దత్తప్ప, ప్రశాంత్ శెట్టి, శ్రీనివాస్ రెడ్డి, సతీష్, రథం, కార్త్ర కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు పతకాలు, జ్ఞాపికల ప్రదానం



విశ్రాంత పీఈటీ వి.గోపాలంను సన్మానిస్తున్న ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి

మక్తల్ పట్టణం, న్యూస్‌టుడే : మక్తల్ మినీ స్టేడియంలో ఈనెల 20న నిర్వహించిన జిల్లాస్థాయి రోడ్ సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి చేతుల మీదుగా పతకాలు, జ్ఞాపికలు అందించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. పీడీ, పీఈటీలు అంబ్రేష్, దామోదర్, రమేష్, రేణుక, ప్రసన్న, సౌమ్య, స్వరూప, మీనాకుమారి, పుష్పలత, వేదవతి, శ్రీలత, క్రీడాకారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వర్షాలతో పత్తి రైతులు విలవిల



దంతన్‌పల్లి శివారులో నేలరాలి మొలకెత్తిన పత్తి

న్యూస్‌టుడే- ఊట్కూరు

ఖరీఫ్ సీజన్‌లో ఈ సంవత్సరం ఆశా జనకంగా వర్షాలు కురవటంతో రైతులు మురిసిపోయారు. ఆరంభం నుంచి సెప్టెంబర్ మొదటి వారం వరకు కురిసిన వర్షాలు రైతుల పంటలకు బలాన్ని చేకూర్చాయి. పత్తి, కంది పంటలు ఏపుగా పెరిగి అధిక పూత, పిందెలతో విరబూశాయి. పంట చేతికొస్తున్న సమయంలో భారీ వర్షాలు కురవటంతో రైతులు సాగు చేసిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి పూత, పిందెలు రాలిపోయాయి. పత్తికాయలు పగులుతున్న సమయంలో వర్షం పడి పత్తి బూజుగా మారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వల్ల పత్తి రాలిపోయి, గింజలు మొలకెత్తిన పరిస్థితి ఉంది. కాయలు ఎర్రబడి విచ్చుకోని పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో 5.88 లక్షల ఎకరాలల్లో పత్తి పంట సాగు చేశారు. ప్రతి రైతు ఒక్కొక్క ఎకరా పత్తి పంట సాగుకు రూ.25 వేలు నుంచి రూ.30వేలు పెట్టుబడిగా పెట్టారు. సెప్టెంబరు మొదటి వారంలో కురిసిన భారీ వర్షాలకు పొలాల్లో నీరు నిలిచి, పత్తి, కంది పంటలకు నష్టం వాటిల్లింది. పూత నేలరాలింది. కాయలు తగ్గిపోయి దిగుబడిపై తీవ్ర ప్రభావం పడింది. కాస్త వర్షం తెరిపిచ్చినా పొలాల్లో తేమ వదలలేదు. మళ్లీ కురిసిన వర్షాలతో విచ్చుకున్న పత్తి రాలిపోయి, వర్షాల వల్ల మొలకెత్తాయి.



ఊట్కూరు శివారులో నల్లగా మారిన పత్తి పంట

అతిగా కురిసిన వర్షాల వల్ల నష్టం..

నేను 8 ఎకరాలు పత్తి పంట సాగు చేశాను. దాదాపు రూ. 2లక్షలు పెట్టుబడి పెట్టాను. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు బాగా కురిశాయి. పంట ఏపుగా పెరిగినా పువ్వులు రాలేదు. మొగ్గ అవుతున్న దశలో భారీ వర్షాలతో మొత్తం రాలిపోయింది. ప్రస్తుతం పత్తి కాయలు విచ్చుకున్న దశలో కురుస్తున్న వర్షాలకు పత్తి నేలపై రాలిపోయి, గింజలు మొలకెత్తుతున్నాయి. కూలీలకు డబ్బులు చెల్లించేందుకు, ఇప్పటి వరకు 9 క్వింటాళ్లు విక్రయించగా, రూ.7 వేలు క్వింటా చొప్పున రూ. 63 వేలు వచ్చింది. ప్రస్తుత పరిస్థితుల్లో పత్తి మొత్తం తీసి అమ్మినా, పెట్టుబడి డబ్బులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

- మేకల ఆశన్న, రైతు, ఊట్కూరు.

పోలీసుల త్యాగాలు మరువలేనివి

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే : పట్టణంలోని ఠాణాలో సోమవారం పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మౌనం పాటించి విధి నిర్వాహణలో పోలీసు వీరుల త్యాగాలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఆచారి, బలరాం, లాల్‌సింగ్, నరేష్, శ్రీహరి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా, న్యూస్‌టుడే : మాగనూరు కృష్ణా మండల కేంద్రాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రాల్లోని ప్రధాన వీధులలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న అఖిల పక్ష నాయకులు మాట్లాడుతూ విధినిర్వహణలో అమరులైన వారిని స్మరించుకోవడం అందరి బాధ్యతని అన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పీఆర్టీయూ టీఎస్ నాయకులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : లక్ష్మీపల్లి, తిప్రాస్‌పల్లి, మగ్దుంపూర్, పులిమామిడి, అవుసులోనిపల్లి, చిన్నపొర్ల తదితర పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో కొత్త ఉపాధ్యాయుల నుంచి సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. నాయకులు కె.గోవర్ధన్, నరసింహారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించటంలో తమ సంఘం ముందుంటుందన్నారు. జీహెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతురాలికి సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న 1988 పూర్వ విద్యార్థులు

ఊట్కూరు, న్యూస్‌టుడే : ఈశ్వర్ మందిర్ ప్రాంతానికి చెందిన గొల్ల రాజేశ్వర్, లావణ్య దంపతుల కుమార్తె భవ్యశ్రీ ఇటీవల ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించింది. ఈనేపథ్యంలో 1988 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో విద్యార్థిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యుడు సి. సూర్యప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ డాక్టరుగా మంచి పేరు ప్రఖ్యాతులు సాధించి, సమాజ సేవ చేయాలని సూచించారు.

అన్ని రంగాల్లో విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషి



వీసీ డా.జీఎన్ శ్రీనివాస్‌కు మొక్క అందిస్తున్న రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు

పాలమూరు, న్యూస్‌టుడే : పాలమూరు విశ్వవిద్యాలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉపకులపతి (వీసీ) డా.జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విశ్వవిద్యాలయానికి రాగా రిజిస్ట్రార్ డా.మధుసూదన్‌రెడ్డి, ఆచార్యులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం తన ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పీయూకు తాను ఉపకులపతిగా రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. 29 ఏళ్ల నుంచి తాను బోధనా రంగంలోనే ఉన్నానని, విశ్వవిద్యాలయాన్ని ఎలా అభివృద్ధి చేయాలో తనకు తెలుసని పేర్కొన్నారు. ఎక్కువ మంది గ్రామీణ విద్యార్థులే ఉంటారని, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. విద్యతోపాటు సహ పాఠ్య అంశాలు, పోటీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయటంపై దృష్టిసారిస్తామని తెలిపారు. తరగతులు, వసతి గృహాలు, బోధన, బోధనేతర సిబ్బంది, పరిపాలన, పర్యవేక్షణ తదితర అంశాలపై దృష్టి సారిస్తామన్నారు. వచ్చే ఏడాది న్యాయ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాలలను ప్రారంభిస్తామన్నారు. పీయూ అభివృద్ధికి ప్రభుత్వ, తాత్కాలిక, పొరుగు సేవలు, ఒప్పంద ఉద్యోగుల సహకరించాలని, ఎలాంటి సమస్య ఉన్నా.. నేరుగా తన వద్దకు రావచ్చని తెలిపారు. పరీక్షల నియంత్రణ అధికారి రాజ్‌కుమార్, అధికారులు విజయలక్ష్మి, శాంతిప్రియ, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ప్రవీణ, ప్రిన్సిపల్స్ చంద్రకిరణ్, నూర్జహాన్, బషీర్ అహ్మద్, వెంకట్‌రెడ్డి, భగవంతురెడ్డి, భాస్కర్, జైపాల్‌రెడ్డి, కుమారస్వామి, రవికుమార్ పాల్గొన్నారు.

మున్నూరు కాపు సంఘం జిల్లా కన్వీనర్‌గా బండి

పాతబస్టాండ్(నారాయణపేట), న్యూస్‌టుడే : మున్నూరు కాపు సంఘం జిల్లా కన్వీనర్‌గా బండి శివరాం రెడ్డి, కో-కన్వీనర్‌గా సుతారి సత్యరఘుపాల్ రెడ్డి నియమితులయ్యారు. నారాయణపేట అంజనా గార్డెన్‌లో పట్టణ అధ్యక్షుడు శీల శ్యాం ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు మున్నూరు జయపాల్‌రెడ్డి, జిల్లా నాయకులు కొండా పురుషోత్తం రెడ్డి హాజరయ్యారు. జిల్లా కన్వీనర్, కో కన్వీనర్‌తోపాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

గాలికుంటు టీకాలు వేయించాలి

దామరగిద్ద, న్యూస్‌టుడే : పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయించుకోవాలని పశువైద్యాధికారి డా.శ్రీనివాస్ తెలిపారు. కాన్‌కుర్తి, క్యాతన్‌పల్లి, ఉడ్మలగిద్ద గ్రామాల్లో పశువైద్యశిబిరాలు ఏర్పాటుచేసి గాలికుంటు నివారణకు టీకాలు వేశామని తెలిపారు. పశువుల పెంపకందారులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో టీకాలు వేయించుకోవాలన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

దామరగిద్ద, న్యూస్‌టుడే : మండలంలోని గడిమున్‌కన్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈవో కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనఖీ చేశారు. పాఠశాలలో పరీక్షల నిర్వహణ, మధ్యాహ్నభోజనం పరిశీలించారు. విద్యార్థులంతా రోజూ పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఉపాధ్యాయుల సహకారంతో అందరు విద్యార్థులకు స్టీల్ నీళ్ల సీసాలు ఇవ్వడాన్ని అభినందించారు. హెచ్ఎం నగేష్, అశోక్, నరేష్, సీఆర్పీ మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.